క్లుప్తంగా

ఎమ్మెల్యే దొరబాబుకు అభినందనలు



పిఠాపురంలో ఎమ్మెల్యే దొరబాబును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పిఠాపురం: రాష్ట్ర పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యే పెండెం దొరబాబును గురువారం పలువురు వైఎస్సార్ సీపీ నేతలు అభినందించారు. స్థానిక పార్టీ కారాయయంలో వైఎస్సార్ సీపీ నేతలు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బొజ్జా దొరబాబు, రెడ్డెం జనార్దనరావు, కొత్తపల్లి బుజ్జి, పచ్చిమళ్ల అప్పలరాజు, బాలిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పెద్దాపురం: రిలయన్స్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ మేనేజర్ బి.నాగేశ్వరావు అన్నారు. స్థానిక మహారాణి కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు సంస్థ ద్వారా అందించే స్కాలర్‌షిప్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల బయాలజీ హెచ్‌ఓడీ జ్యోతిర్మయి అధ్యక్షతన జరిగిన సదస్సులో నాగేశ్వరరావు మాట్లాడుతూ రాత పరీక్షలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇంటర్‌లో 60 మార్కులు వచ్చి ఉండాలని అన్నారు. కళాశాల అధ్యాపకులు భానుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి కొప్పన జయంతి



కొప్పన మోహనరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పిఠాపురం: మాజీ మంత్రి కొప్పన మోహనరావు జయంతి వేడుకలను గురువారం ఆయన స్వగ్రామం పిఠాపురం మండలం మల్లాంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కొప్పన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ జిల్లా కన్వీనర్ బత్తుల సాయి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి ఆధ్యాత్మికత అవసరం



ఉపవాస ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

పెద్దాపురం: మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో రెవరెండ్ నంగిన సత్యానందం ఆధ్వర్యంలో ఉపవాస ప్రార్థనలను గురువారం ప్రారంభించారు. సీజీఎం వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన ప్రారంభమైన ప్రార్థనల్లో దైవజనులు రాజ్‌కుమార్, కె.జయకుమార్ మాట్లాడుతూ ప్రపంచ శాంతికై ప్రతి ఒక్కరూ పరిశుద్ధ ఆధ్యాత్మికతను అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. సంఘ సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. దైవ సేవకులు అభిషేక్, పాస్టరమ్మలు నంగిన శాంతకుమారి, ప్రేమలత, విశ్వాసులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారికి కమిషనర్‌గా పదోన్నతి



పూడి రవిబాబు

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పని చేసిన పూడి రవిబాబుకు పదోన్నతి లభించింది. శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌గా ఆయనకు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. దాంతో గురువారం ఆయన శ్రీకాకుళంలో బాధ్యతలు స్వీకరించారు. రవిబాబును కమిషనర్ జె.రామారావు, మేనేజరు అచ్యుతరాజు, ఇతర సిబ్బంది అభినందించారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొత్తమూలపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష



కొత్తమూలపేటలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు, అధికారులు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సేవలను పరిశీలిస్తున్న దొరబాబు



వేట్లపాలెంలో రోగులకు మందులు అందజేసిన ఎంపీడీఓ, ఆరోగ్య సిబ్బంది

కొత్తపల్లి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని కొత్తమూలపేటలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రమేష్, ఆర్డీవో సత్యనారాయణ, జిల్లా పంచాయతీ శాఖ అధికారి విక్టర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ప్రజలకు వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరంలో 380 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామాల్లో ప్రజలు గతంలో వైద్య పరీక్షలు కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అన్నిరకాల పరీక్షలు చేస్తున్నారన్నారు. ఆర్డీఓ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం గృహ నిర్మాణం, విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. నాడు–నేడు పథకంలో పాఠశాలలు, ఆసుపత్రులను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ రమేష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతిరోజు 20 ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరాల్లో ప్రైవేటు, ప్రభుత్వ వైద్య సిబ్బందితో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజలు జగనన్న సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచులు పులి జయబాబు, రావి రమేష్, నక్కా మణికంఠ, మాజీ సర్పంచ్ వడ్డి నాగమణి, ఎంపీడీఓ పి.వెంకట నారాయణ, తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం : ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ఆరోగ్య సమస్యలను గుర్తించి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం అధ్యక్షతన గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి దవులూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి తగు వైద్యం అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, రక్తహీనత సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నని జగనన్న ప్రభుత్వమన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు నల్లల గోవిందు మాట్లాడుతూ ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సరిత, ఎంపీటీసీ నల్లల సూర్యకుమారి, ఉప సర్పంచ్ బండారు చంటిబాబు, పెంటా విజయ్‌కుమార్, బిక్కిన శేషకుమారి, ఏలేటి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యాన్ని సద్వినియోగం చేసుకోండి

సామర్లకోట: ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందజేయడానికి జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. మండల పరిధిలో వేట్లపాలెం రెండో సచివాలయం పరిధిలో గురువారం సురక్ష శిబిరాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. శిబిరానికి సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో బలహీనంగా ఉన్న విద్యార్థులకు వైద్యులు రక్తహీనత పరీక్షలు చేయగా ఎంపీపీ వారికి మందులు అందజేశారు. గ్రామంలో నాలుగు సచివాలయాల పరిధిలో జరిగే సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రజల అనారోగ్యాన్ని బట్టి రూ.ఐదు లక్షల వరకు ఆయా కార్పొరేట్ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయిస్తారని ఆమె వివరించారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఎంఈఓ– 2 పి.పుల్లయ్య, సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యులు ప్రశాంత్, శ్రీహిమవతి, హెల్త్ సిబ్బంది, మండల పరిషత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5 లక్షల వైఎస్సార్ బీమా అందజేత



మృతుని భార్య కామేశ్వరికి వైఎస్సార్ బీమా చెక్కు అందజేసిన కౌన్సిలర్ హరిబాబు

సామర్లకోట: స్థానిక బలుసులపేటలో చర్చి గోడ కూలి చనిపోయిన మచ్చా శామ్యూల్ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో రూ.ఐదు లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు మృతుని భార్య కామేశ్వరికి రూ.ఐదు లక్షల చెక్కును అందజేశారు.

హుస్సేన్‌పురంలో భారీ అన్నదానం



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సామర్లకోట: మండల పరిధిలో హుస్సేన్‌పురంలో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని శెట్టిబలిజపేట గణపతి శిబిరం వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో సుమారు మూడు వేల మందికి అన్నదానం చేశారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గణేష్ యూత్ నాయకులు పలివెల వెంకటరమణ, గుత్తుల సత్యనారాయణ, వాసంశెట్టి విక్రమ్, వాసంశెట్టి మునలయ్య, గుడాల గణేష్, గుత్తి శ్రీను, కొప్పిశెట్టి గోవిందు, పలివెల శివ, బొంతు లోవరాజుల ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



శ్రీరాంపురంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎమ్మెల్యే దొరబాబు
- శ్రీరాంపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే దొరబాబుకు సర్పంచ్ రావి రమేష్ ఆధ్వర్యంలో నాయకులు స్వాగతం పలికి పూలమాల, శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే పార్టీ నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎస్ఈజెడ్ పేరుతో శ్రీరాంపురం గ్రామాన్ని గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల రూపురేఖలను మార్చుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన : శ్రీరాంపురం నుంచి బీచ్ రోడ్డు వరకూ సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు గురువారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలు, గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షలు వెరసి రూ.35 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచులు నక్కా మణికంఠబాబు, పులి జయబాబు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రదాత పిఠాపురం మహారాజా



పిఠాపురం మహారాజా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: వేల ఎకరాల భూములను విద్యాభివృద్ధి కోసం ధారాదత్తం చేసిన మహోన్నత విద్యా ప్రదాత పిఠాపురం మహారాజా అని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మహారాజా జయంతి సందర్భంగా గురువారం పిఠాపురం కోటగుమ్మం సెంటర్లో ఉన్న మహారాజా వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది పేదలు విద్యావంతులుగా తయారవ్వడానికి మహారాజా చేసిన కృషి ఎనలేనిదన్నారు. ప్రజా సంక్షేమానికి బాటలు వేసిన పిఠాపురం మహారాజా ఆశయాలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలని కోరారు. లక్షలాది మంది విద్యార్థులు ఆయన ఏర్పాటు చేసిన విద్యాలయాల్లోనే చదువుకుని ఎంతో గొప్పవారు అయ్యారని, అలాంటి దాత పిఠాపురంలో జన్మించడం ఈ ప్రాంత వాసుల అదృష్టంగా ఆయన అభివర్ణించారు. విద్యాభివృద్ధికి పిఠాపురం మహా రాజా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, పిఠాపురం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు, గండేపల్లి బాబీ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

కొత్తపల్లి: మండలంలోని శ్రీరాంపురంలో అమజాలపు పోలయ్యకు చెందిన తాటాకిల్లు ఇటీవల దగ్ధమైంది. కాగా గురువారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

సర్పంచ్ తండ్రి రావి నూకరాజుకు పరామర్శ

శ్రీరాంపురం సర్పంచ్ రావి రమేష్ తండ్రి రావి నూకరాజు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. గురువారం రామరాఘవపురంలోని స్వగృహం వద్ద పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ కారే సుధ, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, ఎండపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గుండ్ర రాజబాబు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జగ్గంపేట: కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పిఠాపురం మండలం విరవాడ గ్రామానికి చెందిన కొమ్మినీడి శివదుర్గ (24) దివిలిలోని బీఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీ సమయంలో జగ్గంపేట శివారులో ఉన్న పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. గతంలో కోళ్ల ఫారం పెట్టుకోవడానికి రూ.3 లక్షలు అప్పు చేశాడు. ఆ సొమ్మును ఆన్‌లైన్‌లో క్యాసినో ఆడి పోగొట్టుకొన్నాడు. ఈ విషయం ఇంట్లో చెపితే తిడతారన్న భయంతో గత నెల 30న పెట్రోల్ బంక్ సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పెట్రోల్ బంక్ సిబ్బంది అతడిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై మృతుడి సోదరుడు కొమ్మినీడి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక హెచ్‌సీ పి.సూరిబాబు తెలిపారు.

పిఠాపురంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని వినతి



రైల్వే బోర్డు సమావేశంలో పాల్గొన్న మాధవరావు

పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురంలో రత్నాచల్, జన్మభూమి, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ల హాల్ట్‌కు చర్యలు తీసుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందజేసినట్లు జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు రావుల మాధవరావు గురువారం తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రైల్వే బోర్డు సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం–కాకినాడ రైల్వే మెయిన్ లైన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. పిఠాపురం మండలం మాధవపురం కొత్తపల్లి మండలం కొండెవరం కనెక్టవిటీ రోడ్డు నిర్మించాలని కోరారు. పిఠాపురం రైల్వే స్టేషన్లో లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సౌత్ సెంట్రల్ రైల్వే మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ పిఠాపురంలో రత్నాచల్, జన్మభూమి, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ల హాల్ట్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. పిఠాపురం రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ఎంఈఓలను సత్కరిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

కొత్తపల్లి: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల లక్ష్యమని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో ఎంఈఓలు వేణుగోపాల్, పైడిరాజులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి చేసే ప్రతి గురువుకు వందనమన్నారు. ఉపాధ్యాయులను ప్రతీ ఒక్కరూ గౌరవించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండలాధ్యక్షుడు పి.ఆనంద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లలితాకుమారి, జిల్లా ఉపాధ్యాయవాణి కన్వీనర్ జె.కుమార శేఖర్, రాష్ట్ర పీఆర్సీ కన్వీనర్ యు.శ్రీనివాస్, ఆదిత్యమూర్తి, వై.పద్మజ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఫ్యాకల్టీలు

సామర్లకోట: డ్వామా ఏపీఎం, ఏపీఓలకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. అధికారులు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం ప్రిన్సిపాల్, డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ వారికి సూచించారు. ప్రస్తుత సీజన్‌లో మొక్కలు ఎక్కువగా నాటే అవకాశం ఉంటుందని, ఉపాధి హామీ పథకంలో వీటి ప్రాధాన్యత ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలకు పోషకాలు అందించే మొక్కలను ప్రతి గ్రామంలో నాటాలని ఆయన సూచించారు. ఈ మేరకు మునగ విత్తనాలను వేసుకోవడంపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. మునగ ఆకులోను, మునగకాడలోనే అనేక పోషకాలు ఉంటాయని చెప్పారు. మునగ విత్తనాల లభ్యత, కాండంతో నాట్లు వేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కోర్సు డైరెక్టర్ నిహారిక శిక్షణలో నేర్చుకున్న అంశాలపై వివరాలు సేకరించారు. వారికి రాత పరీక్ష నిర్వహించిన అనంతరం ఫ్యాకల్టీలు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతి మండలంలోను జగనన్న ఆరోగ్య సురక్ష జరుగుతుండడం వల్ల శిక్షణలకు విరామం ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉపాధ్యాయుడిపై పోలీసులకు ఫిర్యాదు

పిఠాపురం: విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాలిక తల్లిదండ్రులు గురువారం రాత్రి పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిఠాపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న తమ కుమార్తె పట్ల పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. అతను పట్టించుకోపోవడంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. సంబంధిత ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే తీవ్రంగా ఉద్యమిస్తామని బాలిక తల్లిదండ్రులు హెచ్చరించారు.

ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం



ప్రిన్సిపాల్ సుభాషిణిని సన్మానిస్తున్న ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు

పిఠాపురం: విద్యార్థుల ఎదుగుదలే ఉపాధ్యాయులకు గురుదక్షిణ అని పిఠాపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుభాషిణి అన్నారు. పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు, హైస్కూల్ హెచ్‌ఎం వైవీబీ రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని ఉపాధ్యాయ వృత్తి ఔన్నత్యాన్ని వివరించారు. అనంతరం ఉపాధ్యాయులను ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మన ఊరు–మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ సభ్యులు నగేష్, కొండేపూడి శంకరరావు, కేవీఎస్ఎస్ ప్రసాద్ ప్రభు, చక్రధర్, ఐ.కుమారి పాల్గొన్నారు.

ఫిష్ స్టాల్స్‌తో యువతకు ఉపాధి

- మత్స్యశాఖ ద్వారా సబ్సిడీ
- ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి



ఫిష్‌స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా కల్పించే సబ్సిడీని సద్వినియోగం చేసుకుని యువత స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక డైరీఫారం సెంటర్, పాములాలతూము జంక్షన్‌లలో ఏర్పాటు చేసిన ఫిష్ స్టాల్స్‌ను (మినీ రిటైల్ అవుట్‌లెట్) ఆయన గురువారం ప్రారంభించారు. రూ.1.75 లక్షలతో ఏర్పాటు చేసిన ఈ స్టాల్స్‌కు లబ్ధిదారుని వాటాగా 10 శాతం సమకూర్చుకుంటే, 75 శాతం మత్స్యశాఖ ఇస్తుందని, 15 శాతం బ్యాంకు రుణం పొందవచ్చని చెప్పారు. ఇటువంటి పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జీసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, జిల్లా మత్స్య శాఖ అధికారి సత్యనారాయణ, ఎఫ్‌డీఓ నూకరాజు, స్థానిక నాయకులు వాసుపల్లి కృష్ణ, వాసుపల్లి రాంబాబు, ఎరిపల్లి సీతారామ్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై స్వామి నాయుడు

కొత్తపల్లి: రాష్ట్రంలో మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని స్థానిక ఎస్సై స్వామి నాయుడు తెలిపారు. మండంలోని కుతుకుడుమిల్లి శివారు పెదకలవలదొడ్డిలో గురువారం వారధి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రత, పోలీసుల విధులపై చిత్రీకరించిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో ఉత్సవాల పేరుతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులతో మమేకం కావాలని కోరారు మహిళలు తమ సెల్‌ఫోన్లలో తప్పనిసరిగా దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి చిన్నారావు, ఎంపీటీసీ రాయుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొత్తపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని హెల్త్ సూపర్ వైజర్ అరుణ అన్నారు. మండలంలోని కొత్తమూలపేటలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా బాలుడి మృతి

పెద్దాపురం: పట్టణంలో బాలుడి మృతి ఘటన కొద్దిపాటి కలకలం రేపింది. స్థానిక పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం స్థానిక లూథరన్ హైస్కూల్ ఎదురుగా ఉన్న బాలాజీ అపార్ట్‌మెంట్ వద్ద చార్లెస్ రే (10) ఫిట్స్ లక్షణాలతో ఇబ్బంది పడుతున్నాడు. స్థానికుల సమాచారంతో వచ్చిన పోలీసులు ఆ బాలుడిని దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యంతో కొంత ఉపశమనం పొందిన ఆ బాలుడిని ఆమె తల్లికి అప్పగించారు. కాగా మెరుగైన చికిత్స కోసం అతడిని కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెలుగుల సురేష్ వివరించారు. కాగా ఈ ఘటనపై స్థానికంగా సామాజిక మాధ్యమాల్లో భిన్న కథనాలు వ్యక్తమవడం కొంత గందరగోళానికి దారితీసింది.